సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 5 । జనవరి । 2025



సంక్రాంతికి ప్రత్యేక బస్సులు
సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారి కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఆదిలాబాద్ రీజియన్‌లోని డిపోల పరిధిలో నుంచి 290 ప్రత్యేక బస్సులు నడవనుంది. 8లో▸



యువతను ప్రోత్సహించాలనే..
యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఏడేళ్లుగా మాజీ ప్రధాని వాజ్‌పేయి పేరిట క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.0 /16.0
జిల్లాలో ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



నగదు పారితోషికం అందజేస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్, సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 140 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంగ్లిష్ మీడియం నుంచి షేక్ అశ్వక్ (జెడ్పీహెచ్ఎస్, కలమడుగు), అక్షయ(జెడ్పీహెచ్ఎస్, వెల్గనూర్), అక్షిత (జెడ్పీహెచ్ఎస్, సబ్బెపల్లి), నిషిస్‌కుమార్ (జెడ్పీహెచ్ఎస్, కలమడుగు), తెలుగు మీడియంలో చరణ్ (జెడ్పీహెచ్ఎస్, కిష్టాపూర్), రఘువిశ్వంత్ (జెడ్పీహెచ్ఎస్, బాదంపల్లి), నందిని (చింతగూడ, జన్నారం)విజేతలుగా ప్రకటించారు. డీఈవో యాదయ్య చేతుల మీదుగా నగదు పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో సోషల్ స్టడీస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, కార్యదర్శి మహేష్, సభ్యులు చక్రధర్‌రావు, లక్ష్మీనారాయణ, రాజన్న, మధుకర్, గోవర్ధనచారి, గురువయ్య, తదితరులు పాల్గొన్నారు.

టైగర్‌జోన్‌లో రాకపోకలపై కఠిన నిర్ణయం



టైగర్‌జోన్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

జన్నారం: టైగర్‌జోన్‌లో రాత్రిపూట రాకపోకలపై కఠినంగా వ్యవహరించనున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. టైగర్‌జోన్ ప్రాంతంలో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోకలు నిషేధించామని, అయితే కొందరు ఇదే దారిగుండా నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాల వైపు రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. రాత్రి పూట వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి 9 గంటలు దాటాక స్థానికులు తప్పా ఇతర ప్రాంతాల వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. వన్యప్రాణుల సంక్షేమం, ప్రయాణికుల సురక్షిత ప్రయాణం విషయంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ విషయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సహకరించాలని కోరారు.

జన్నారం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం






లక్ష్మీనారాయణ, చైర్మన్ ఫసీఉల్లా, వైస్‌చైర్మన్

జన్నారం: జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా పొనకల్‌కు చెందిన సయ్యద్ ఫసీఉల్లా, డైరెక్టర్లుగా ఎల్ల లావణ్య, అంబటిపెల్లి నర్సయ్య, ముత్యం రాజన్న, జెడద సత్తయ్య, భీమనేని రాజన్న, లాకావత్ తిరుపతి, గర్వందుల సత్యగౌడ్, రేగుంట ప్రదీప్, పులిశెట్టి లావణ్య, పూసం సోనేరావుతో పాటు 16 మందిని సభ్యులుగా నియమించారు. ఈనెల 5న ఆదివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నారు

వైకల్యాన్ని అధిగమించాలి



కేక్ కట్ చేయిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: వైకల్యాన్ని అధిగమించి తాము ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూయి బ్రెయిలీ అంధులకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన అందించిన బ్రెయిలీ లిపి ద్వారా ఎంతో మంది అంధులు ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ఎఫ్ఆర్‌వో ఫర్జానా బేగం, డీసీపీవో ఆనంద్, అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ లైఫ్




మంచిర్యాల పట్టణం రైల్వే బ్రిడ్జి సమీపంలో ఓ ఆటో డీజిల్ అయిపోయి హఠాత్తుగా నిలిచిపోయింది. దీంతో తనకు డీజిల్ కావాలంటే ఆటోను అక్కడే వదిలిపెట్టి వస్తే సురక్షితం కాదని భావించిన డ్రైవర్ వెంటనే ఏ టూ జెడ్ సర్వీస్ వారికి కాల్ చేశాడు. తనకు కావాల్సిన డీజిల్ తన వద్దకే తెప్పించుకున్నాడు. నగరాల్లో విస్తరించిన కల్చర్ ఇప్పుడు జిల్లాలోనూ మొదలైంది.

- అందరి చేతిలో ఫోన్, అంతా ఆన్‌లైన్
- స్మార్ట్‌ఫోన్‌తోనే అనేక కార్యకలాపాలు
- సులువుగా, వేగంగా అందుతున్న సేవలు
- జిల్లా ప్రజలు విస్తృతంగా వాడకం


సండే స్పెషల్

స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. క్షణాల్లో పనులు జరిగిపోతున్నాయి. కాస్తంత సెల్‌ఫోన్ వాడకం తెలి సుంటే అనేక విధాలుగా మేలు జరుగుతోంది. దీంతో రోజువారీగా యాప్‌ల ఉపయోగం పెరిగిపోతోంది. ఇప్పటికే ప్రతీ ఇల్లు ఈ కామర్స్‌ల్లో ఆన్‌లైన్ షాపింగ్ చేస్తోంది. వీటితో పా టు సోషల్ మీడియాను అనుకూలంగా మార్చుకుని రోజువారీగా పనులు సులువుగా చేసుకుంటున్నారు. జిల్లాలో ఈ తీరు క్రమంగా పెరుగుతోంది. భోజనం, వసతి, ప్రయాణం, వినోదం, తదితర పనులన్నీ ఆన్‌లైన్‌లో చేసే ట్రెండ్ కొనసాగుతోంది. – సాక్షి ప్రతినిధి, మంచిర్యాల



విపరీతంగా ఫుడ్ ఆర్డర్లు

ఇంట్లో వంట చేయడం కుదరని పక్షంలో చాలా మంది ఫుడ్ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తూ ఆరగించేస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో ప్రముఖ కంపెనీలు తమ సేవలు ప్రారంభించాయి. దీంతో నిమిషాల్లో భోజనం ఇంటికి చేరుతోంది. ఎంపిక చేసుకున్న హోటళ్ళు, రెస్టారెంట్ల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. వారాంతాలు, సెలవు దినాలు, పండుగలు, పర్వదినాల్లో ఇలాంటివి ఎక్కువగా వినియోగించుకుంటున్నారు. ఇక పుట్టిన రోజు, పెళ్ళి రోజులు వంటి సందర్భాల్లోనూ ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. పట్టణ శివారు ప్రాంతాల దాక డెలివరీ బాయ్స్ సేవలు ఇస్తున్నారు.



రైల్వే, బస్‌యాప్‌లు..

కూర్చున్న చోటు నుంచి మరో చోటుకు వెళ్లేందుకు స్మార్ట్‌ఫోన్లను ఉపయోగిస్తున్నారు. జిల్లాలో మంచిర్యాల, రవీంద్రఖని, మందమర్రి, బెల్లంపల్లి, రేచ్నీరోడ్ వరకు రైల్వేస్టేషన్లు ఉండగా నిత్యం వేలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే లైవ్ ట్రైన్ లొకేషన్ తెలుసుకునే యాప్‌లను విరివిగా వాడుతున్నారు. రైల్వే శాఖ సంబంధించిన అధికారిక యాప్‌లతో పాటు ప్రైవేటు యాప్‌ల సాయంతో ట్రైన్ ఎక్కడుందో తెలుసుకుంటున్నారు. అలస్యం, ముందు టైం ప్రకారం స్టేషన్‌కు చేరుకుంటున్నారు. ఇక రిజర్వేషన్‌తో పాటు జనరల్ టికెట్లు తీసుకునే అవకాశం ఉండడంతో సెల్‌ఫోన్‌లోనే టికెట్ చూపించి రైళ్లు, బస్సుల్లో ప్రయాణం చేసే సౌకర్యం కలిగింది. టీజీఆర్టీసీ సైతం ఇలాంటి సదుపాయాలు అందుబాటులోకి తెచ్చింది. లగ్జరీ, సూపర్ లగ్జరీ, ఇంద్ర, లహరీ బస్సుల్లో నేరుగా యాప్‌తో చెల్లించే సదుపాయాలు వచ్చాయి. ఇవే కాకుండా ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలు, షేరింగ్ వాహనాల సౌకర్యం ఇచ్చే యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.

లోకల్‌గా ట్రావెల్



గతంలో నగరాలకే పరిమితమైన లోకల్ ట్రావెల్ యాప్‌లు సైతం మంచిర్యాల పట్టణంలోకి అందుబాటులోకి వచ్చాయి. 'రాపిడో' వంటి యాప్‌లు ఇప్పటికే తమ సర్వీసులు ప్రారంభించాయి. బైక్, ఆటోలు బుక్ చేసుకుంటే లోకల్‌లో సులువుగా వెళ్లే వీలు చిక్కింది. ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో ఇంటి నుంచే ప్రయాణికులు ఈ యాప్‌తో సౌకర్యవంతంగా ముందస్తుగా చార్జీల విలువ తెలుసుకుని ప్రయాణం చేసే వీలుంది. అంతకుముందు రోడ్డుపైకి వచ్చి ఆటో తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

రైతు ఉత్పత్తులు సైతం..

వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేస్తూ అనేక మంది తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఉదాహరణకు హాజీపూర్ ఫార్మర్ కంపెనీ ఆర్గనైజేషన్‌తో రైతులు తమ పంట ఉత్పత్తులు అమ్ముకుంటున్నారు. అలాగే పరస్పర సహకారంతో వాట్సాప్ వేదికగా ఓ గ్రూప్ ఏర్పాటు చేసుకుని సమాచారం పంచుకుంటున్నారు. ఇటీవల వానాకాల సీజన్‌లో రైతులే ధాన్యం సేకరించి, బియ్యంగా మార్చి విక్రయాలు చేస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌లతో సమాచారం అందిస్తూ అవసరమైన వారికి చేరుస్తున్నారు. వీరే కాకుండా అనేక ప్రాంతాల రైతులు తమ ఉత్పత్తులను అమ్మేస్తున్నారు. ఇక జిల్లా సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం వాట్సాప్ గ్రూప్ సైతం పంటల సాగుకు ప్రోత్సాహం, ఉత్పత్తుల విక్రయాలు చేస్తున్నారు.



ఏ టు జెడ్ సర్వీస్

జిల్లా కేంద్రంలో ఆన్‌లైన్‌లో ఆర్డర్లు చేసే వారి సంఖ్య పెరిగిపోతోందని గుర్తించి పట్టణానికి చెందిన శేడే సతీశ్ కుమార్ ఏ టూ జెడ్ అనే ఆన్‌లైన్ సర్వీస్ ప్రారంభించారు. మంచిర్యాల పరిధిలో కావాల్సిన ఏ వస్తువైనా అర గంట వ్యవధిలోనే అందిస్తున్నారు. కూరగాయాల నుంచి వస్త్రాలు, మెడిసిన్, భోజనంతో పాటు ఏవైనా సరఫరా చేస్తున్నాడు. ఆయనతో పాటు మరొకరికి నెలకు రూ.10వేల జీతం ఇస్తూ తన ఆన్‌లైన్ డెలివరీ సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 30 నుంచి 40 వరకు ఆర్డర్లు వస్తున్నాయి. భవిష్యత్‌లో తన సేవలు ఇంకా విస్తరించేందుకు సిద్ధమయ్యాడు.

ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రవాణా ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులతో రహదారి భద్రత మాసోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 31వరకు నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ జిల్లాలో రోడ్డు భద్రత అవగాహన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను విద్యార్థులకు పాఠ్యాంశాల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి నిబంధనలు ఉల్లంఘించిన వారి లైసెన్స్ రద్దు చేసి భవిష్యత్‌లో మళ్లీ రాకుండా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నామన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రహదారి భద్రతా మాసోత్సవాలు జిల్లాలో విజయవంతం చేసే దిశగా కృషి చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్, తనిఖీ లు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఏసీపీ ప్రకాష్, జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్‌కుమార్, రోడ్డు భవనాల శాఖ అధికారి రాము, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి పురుషోత్తం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లలో అభివృద్ధి పనులన్నీ పూర్తి

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



వైకుంఠధామం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని, మూడేళ్లలోపు అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో నిర్మిస్తున్న వైకుంఠధామం, మంచిర్యాల మార్కెట్‌లోని రోడ్డు వెడల్పు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. వైకుంఠధామం పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, శివరాత్రిలోగా పూర్తి చేస్తామన్నారు. రాళ్లవాగుకు ఇరువైపులా కరకట్ట నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పైలట్ ప్రాజెక్టు కింద చేపడుతున్నామని, ఆరునెలల తరువాత వ్యాపార కూడళ్ల రూపురేఖలు మారుతాయన్నారు. మంచిర్యాల కార్పొరేషన్‌గా మారితే అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతామన్నారు. తన ఆరోగ్యంపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారంపై అసహనం వ్యక్తం చేశారు. కాలుకు చిన్న ఆపరేషన్ జరిగిందని, ప్రత్యర్థులు దానిని తప్పుగా ప్రచారం చేస్తున్నారని, ప్రజల ఆశీస్సులతో తాను సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉన్నానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానం చేరుకుంటారని జిల్లా రవాణా శాఖా అధికారి (డీటీఓ) సంతోశ్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం హాజీపూర్ మండలం వేంపల్లి జాతీయ రహదారిపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ జిల్లాలో జీరో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐలు రంజిత్‌రెడ్డి, కిషోర్ చంద్రారెడ్డి, ఏఎంవీఐలు ఖాసీం, సూర్యతేజ, రవాణా శాఖ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

వందకోట్లతో అభివృద్ధి పనులు

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో రూ.వంద కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రూ.50 లక్షల నిధులతో చేపట్టిన గిరిజన ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 34 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 50 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్లా రాంరెడ్డి, హిమవంతరెడ్డి, సూర్యనారాయణ, బాపాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

భీమారం: మండల కేంద్రంలో సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వైకుంఠరథం ఏర్పాటు చేయాలని పలువురు యువకులు వినతిపత్రం అందజేశారు.

చింతగూడ సెక్షన్ అధికారి సస్పెన్షన్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని చింతగూడ సెక్షన్ అధికా రి మధుకర్‌ను సస్పెండ్ చేస్తూ సీ ఎఫ్ ప్రభాకర్ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు రేంజ్ అధికారి సు ష్మారావు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కారణంగా స స్పెండ్ చేసినట్లు ఆమె పేర్కొన్నా రు. కాగా చింతగూడ సెక్షన్ పరిధిలోని పైడిపెల్లి బీట్ అధికారిని కూడా ఇటీవలే ఇదే కారణంతో సస్పెండ్ చేశారు.

చివరి ఆయకట్టు వరకూ సాగునీరు

- కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగిలో గూడెం ఎత్తిపోతల పథకం చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, చీఫ్ ఇంజినీర్ బద్రినారాయణ, డీఈ దశరథంతో కలిసి రైతు సంఘాల ప్రతినిధులు, రైతులతో యాసంగిలో సాగునీటి విడుదలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి విడుదలలో సమస్యలు తలెత్తితే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు నీటివృథాను అరికట్టాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం సాగునీటిని విడుదల చేసేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. యాసంగిలో గూడెం ఎత్తిపోతల పథకం కింద 69 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోందన్నారు. దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల పరిధిలో రెండున్నర రోజులు, హాజీపూర్ మండల పరిధిలో రెండు రోజుల చొప్పున ఈ నెల 5 నుంచి ఏప్రిల్ 25 వరకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఈఈలు జాకీర్, రాజేందర్, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ పార్టీ పోలీసులకు గ్రేహౌండ్స్ శిక్షణ

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న స్పెషల్ పార్టీ (సాయుధ పోలీస్ బలగాలు) పోలీస్ సిబ్బందికి శనివారం గ్రేహౌండ్స్ తరహాలో శిక్షణ కార్యక్రమాన్ని సీపీ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేహౌండ్స్ సిబ్బంది వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు, నక్సలైట్ల ఏరివేతకు సంసిద్ధులై ఉండేలా తయారు చేస్తున్నామన్నారు. కమిషనరేట్ పరిధిలో అదే తరహాలో ఏర్పాటైన స్పెషల్ టీమ్ (క్యూఆర్‌టీ) క్విక్ రెస్పాన్స్ టీమ్‌కు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. అడిషనల్ డీసీపీ రాజు, ఏఆర్ఏసీపీ ప్రతాప్, సుందర్‌రావు, ఆర్ఐలు పాల్గొన్నారు.



సిబ్బందికి స్వీట్లు ఇస్తున్న సీపీ శ్రీనివాస్

నిందితులకు శిక్షపడేలా కృషిచేయాలి

మంచిర్యాలక్రైం: కోర్టు కానిస్టేబుళ్లు, లైజన్ ఆఫీసర్లు నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ ఆవరణలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని పోలీస్ స్టేషన్‌లో కోర్టు డ్యూటీ చేస్తున్న కానిస్టేబుళ్లు, లైజన్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. అడిషనల్ డీసీపీ రాజు, ఎస్బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏసీపీ ప్రతాప్, లీగల్ సెల్ సీఐ కృష్ణ, సీసీఆర్‌బీ సీఐ సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ గన్

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్‌గన్‌ను ఉపయోగిస్తున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని జాతీయ రహదారిపై స్పీడ్ గన్‌తో నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. గతేడాది కమిషనరేట్ పరిధిలో స్పీడ్ గన్ ద్వారా 7,047 కేసులు నమోదు కాగా రూ. 72,77,445 జరిమానా విధించామన్నారు.

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


మహేశ్ (ఫైల్)

దండేపల్లి: కడుపు నొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన మెండ మహేశ్ (24) గత రెండేళ్ల క్రితం నుంచి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున పెద్ద ఆసుపత్రిలో చూపించలేదు. దీంతో తరచూ కడుపు నొప్పితో బాధపడేవాడు. ఈక్రమంలో నొప్పి భరించలేక శుక్రవారం గ్రామ పంచాయతీ భవనం సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. రాత్రి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బైక్ పైనుంచి పడి కార్మికుడు మృతి


రాజేశ్ (ఫైల్)

శ్రీరాంపూర్: అదుపుతప్పి బైక్‌పై నుంచి పడి సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ కథనం ప్రకారం.. తీగల్‌పహాడ్ ఏరియాలోని అల్లూరిసీతారామరాజునగర్‌లో నివాసం ఉండే గడికొప్పుల రాజేశ్(32) ఆర్కే 6 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లిలోని మిత్రుడు వద్దకు వెళ్లి కలిసి తన బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. అర్ధరాత్రి ఎన్‌హెచ్ 363 సీసీసీ నస్పూర్ ఫ్లైఓవర్ నుంచి సర్వీసు రోడ్డుకు దిగుతూ బైక్ అదుపుతప్పి కాలువలో పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం హైవే పెట్రోలింగ్ సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెళ్లి చూసే అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇసయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


దగ్ధమైన పత్తి

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామంలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో నిల్వ ఉన్న పత్తి దగ్ధమైంది. మాజీ సర్పంచ్ డోలే చిన్నక్క సుమారు 25 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు చెలరేగి నిల్వ పత్తిపై పడటంతో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై నీటిని చల్లి మంటలార్పివేశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకోలేకపోయారు. సిబ్బంది నడుచుకుంటూ వెళ్లి అక్కడి యువకులు, ప్రజలతో కలిసి మంటలార్పి వేశారు. ప్రమాదంలో దాదాపు రూ.10 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధం కాగా, రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని చిన్నక్క ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని కోరింది.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

- ఈనెల 7 నుంచి 13 వరకు..
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 290 సర్వీసులు
- 15 నుంచి 20 వరకు జేబీఎస్‌కు తిరుగు ప్రయాణం
- 195 బస్సులను సిద్ధం చేసిన ఆర్టీసీ



మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారి కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆదిలాబాద్ రీజియన్‌లో ఆయా డిపోల బస్సులను జేబీఎస్ నుంచి 7 నుంచి 13 వరకు 290 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈనెల 11 వరకు సెలవులు ప్రకటించడం, హైదరాబాద్‌కు వ్యాపార, ఉద్యోగరీత్యా వెళ్లినవారు.. చదువుల నిమిత్తం ఉన్న విద్యార్థులందరూ పండుగకు సొంతూళ్లకు వెళ్తుంటారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సులు నడిపేలా ఆర్టీసీ యోచిస్తోంది. మహాలక్ష్మీ పథకంతో హైదరాబాద్ నుంచి వచ్చే మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను మరింత పెంచనున్నట్లు తెలుస్తోంది.

ఈనెల 7 నుంచి 13 వరకు..

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గతంలో భైంసా, ఉట్నూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపిన ఆశించిన మేర ఆదాయం రాలేదు. ఈ ఏడాది ఈనెల 10, 11న మాత్రమే ఒక్కో బస్సు సర్వీసు నడపనుంది. అత్యధికంగా నిర్మల్ డిపో బస్సులు 88, మంచిర్యాల నుంచి 82 వరకు ఉన్నాయి. మిగిలిన ఐదు డిపోల నుంచి ఈనెల 7 నుంచి 13 వరకు బస్సులను జేబీఎస్ నుంచి గమ్యస్థానాలకు వెళ్లనున్నాయి. ఆదిలాబాద్ నుంచి 58, భైంసా-02 నిర్మల్-88 ఉట్నూర్-02, ఆసిఫాబాద్-58, మంచిర్యాల డిపో నుంచి 81 బస్సులను ఏర్పాటు చేశారు. ఈనెల 10 నుంచి ప్రయాణికుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో అధిక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

తిరుగు ప్రయాణంలో కూడా..

సంక్రాంతి నేపథ్యంలో తిరుగు ప్రయాణంతో రద్దీ అధికంగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వచ్చి వెళ్లేవారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. రద్దీకి అనుగుణంగా బస్సుల రాకపోకలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ డిపోల నుంచి ఈనెల 15 నుంచి 20 వరకు 195 బస్సులు నడపనున్నారు. ఆదిలాబాద్ డిపో బస్సులు 31, భైంసా 4, నిర్మల్ 71, ఉట్నూర్ 1, ఆసిఫాబాద్ 38, మంచిర్యాల 50 బస్సులను తిరుగుప్రయాణానికి వెళ్లే వారి కోసం జేబీఎస్ వరకు ఆర్టీసీ బస్సులను నడపనుంది.

రద్దీకి అనుగుణంగా బస్సులు



పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడుపుతాం. రద్దీ ఎక్కువగా అప్పటికప్పుడు బస్సులు ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీలే ఉంటాయి. రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. బస్సు ఎక్కేటప్పుడు క్యూ పద్ధతి పాటించాలి. ప్రయాణికులకు జేబీఎస్ బస్‌స్టేషన్‌లో ఎప్పటికప్పుడు బస్సుల సమాచారం అందిస్తారు.

– సోలోమాన్, ఆర్‌ఎం, ఆదిలాబాద్

జేబీఎస్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు బస్సుల వివరాలు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
07	02	0	03	02	03
08	02	0	03	02	02
09	04	0	06	04	06
10	15	01	23	15	20
11	15	01	23	15	20
12	10	0	15	10	15
13	10	0	15	10	15

ఉట్నూర్ డిపో బస్సుల రాకపోకలు: ఈనెల 10, 11న బస్సు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

తిరుగు ప్రయాణం కోసం..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
15	07	02	15	08	10
16	08	02	16	10	12
17	04	0	10	05	07
18	04	0	10	05	07
19	04	0	10	05	07
20	04	0	10	05	07

ఉట్నూర్ డిపో నుంచి ఈనెల 16న ఒక బస్సు మాత్రమే నడపనున్నారు.

చోరీ కేసులో మైనర్ అరెస్టు

బోథ్: చోరీ కేసులో మైనర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద గల ఈనెల 2న సూర్యవంశీ ఉలాజీ ఇంటికి తాళం వేసి చేనుకు వెళ్లాడు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో తన ప్యాంటు జేబులో ఉంచిన రూ. 10 వేల నగదు కనిపించలేదు. తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీని పరిశీలించారు. మైనర్ ఇంటి తాళం పగలకొట్టిన వీడియో రికార్డు అయింది. శనివారం మైనర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతని నుంచి రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు కడెం ఆయకట్టుకు నీటి విడుదల

కడెం: కడెం ఆయకట్టు యాసంగి పంటలకు ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు డీఈఈ నవీన్ పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తారని తెలిపారు.

చోరీకి గురైన వస్తువులు అప్పగించాలి

బెల్లంపల్లి: గతనెల 29వ రాత్రి తనపై హత్యాయత్నం చేసి చోరీ చేసిన తన వస్తువులను తిరిగి అప్పగించాలని ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణ కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనకు ప్రాణహాని ఉండటంతో బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్యకు శనివారం వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో యూనియన్ బ్యాంకు వీధిలో సెలూన్ షాప్‌వద్దకు వెళ్లగా రాగం శెట్టి సతీశ్, శ్యామ్ మరో ఆరుగురు తనపై హత్యాహత్నం చేశారన్నారు. ఆ దాడిలో తన వద్ద ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు చైన్, రూ.10,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలి


ఎంపికైన క్రీడాకారులతో పార్థసారథి

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా హాకీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి బాలుర హాకీ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాకీలో జిల్లా ఎన్నో అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చిందన్నారు. ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. వారందరి ప్రదర్శనను స్ఫూర్తిగా తీసుకొని జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7 నుంచి నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. సెలెక్టర్లు జె.రవీందర్, శ్రీనివాస్, అతుల్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా సైన్స్ కేంద్రంలో ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం ఫలితాలు, అత్యధిక మార్కులు సాధించటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పది పరీక్ష విధానంలో వచ్చిన మార్పులకనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అపార్ కార్డు, పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాల గ్రాంట్ల వినియోగం, సైబర్ కాంగ్రెస్ మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరీక్షల విభాగం అదనపు కమిషనర్ దామోదర్‌రావు, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, యశోధ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్యనారాయణమూర్తి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం తెల్లవారుజామున స్థానిక నారాయణరెడ్డి మార్కెట్‌లో గల మ్యాక్స్ మొబైల్ షాప్ తాళా న్ని ఒకరు పగులగొట్టి చోరీకి ప్రయత్నం చేస్తుండగా ఓ వ్యక్తి చూసి యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే యజమాని పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్పీ రాజేష్ మీనా, పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న ఎస్సై సందీప్‌తో కలిసి ఐదు నిమిషాల్లో వెళ్లి దొంగను స్వయంగా పట్టుకున్నాడు. కేసు నమోదు చేసి, మైనర్ కావడంతో శనివారం జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ తరలించారు. ఎస్పీ జానకీ షర్మిల ఈ సందర్భంగా ఏఎస్పీని అభినందించారు.

- పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- జిల్లాకేంద్రంలో ఘటన


రమేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా అడ్డుకున్న పోలీసులు

ఇంటి నిర్మాణ పనులు అడ్డుకున్నారని..


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్

నిర్మల్‌టౌన్: ఇంటి నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు అడ్డుకుంటున్నారని ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. జిల్లా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సోమవార్‌పేట్‌లో శక్కరి రమేశ్ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దీనికి అనుమతులు లేవని టీపీవో హరీశ్ తరచూ వచ్చి వేధిస్తూ పనులు అడ్డుకుంటున్నాడు. విసుగు చెందిన కుటుంబీకులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పెట్రోల్ డబ్బా పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా స్థానిక కౌన్సిలర్ మేడారం అపర్ణ-ప్రదీప్ బైఠాయించారు. మున్సిపల్ అధికారులు అందించిన సమాచారంతో పోలీసులకు అక్కడికి చేరుకున్నారు. తమ బాధను ఎవరూ పట్టించుకోకపోవడంతో రమేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న పోలీసులు పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. తమ సమస్య పరిష్కరించకుంటే కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకుంటామని రమేశ్ తెలిపాడు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ ఖమర్ అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పారు. అయినా రమేశ్ కొన్ని గంటలు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు.

యూత్ ఫెస్టివల్ విజేతలు రిపోర్టు చేయాలి

మంచిర్యాలటౌన్: స్వామివివేకానంద జయంతి పురస్కరించుకుని రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలు జరగనున్నాయి. ఈనెల 6, 7 తేదీల్లో సికింద్రాబాద్‌లోని బోర్డ్స్ క్లబ్స్ ట్యాంక్‌బండ్, యూత్ సర్వీసెస్ హెడ్ ఆఫీస్ ఆడిటోరియంలో నిర్వహించే పోటీలకు వెళ్లే విజేతలు రిపోర్టు చేయాలని జిల్లా యువజనుల, క్రీడల శాఖ అధికారి రాజ్‌వీర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానంలో గెలిచి ఎంపికైన విద్యార్థులు సోమవారం ఉదయం 4 గంటలకు మంచిర్యాల బస్టాండ్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు బాక్సింగ్ కోచ్ రాజేశ్ సెల్ 9963539234 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. పాల్గొనే విద్యార్థులు రెండు పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు, ఏజ్ ప్రూఫ్ సర్టిఫికెట్, బోనాఫైడ్, ఎస్సెస్సీ మెమో జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు.

ఎంపికైన వారి వివరాలు..

పోయెట్రీలో బి.శ్రీవల్లి, స్టోరీ రైటింగ్‌లో ఏ.అంజలి, పెయింటింగ్‌లో ఏ.వర్ష, సైన్స్‌ఫేర్‌లో ఇన్నా తస్నీమ్, టి.అమూల్య, గ్రూప్ ఫోక్‌డాన్స్‌లో విష్ణుప్రియ, ఎస్.అక్షయ, స్నేహితవర్మ, ఈ.అక్షయ, భవ్య, అలేఖ్య, హర్షిని, వైశాలి, శ్వేత, కె.శృతి, గ్రూప్ ఫోక్ డ్యాన్స్ జె.మౌనిక, డి.మాలతి, బి.కాంతి, దీక్షిత, డిక్లమేషన్‌లో ఆర్.సౌమ్య, ఏ.లిఖిత ఎంపికయ్యారు.

ఐదుగురు బైండోవర్

సిర్పూర్(టి): పశువుల అక్రమ రవాణాలో పట్టుబడిన ఐదుగురిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. వీరిలో రాజేందర్, సతీశ్, సారయ్య, అఫ్జల్, భాస్కర్ ఉన్నారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పేకాటస్థావరంపై దాడులు

దహెగాం: ఎస్పీ డీవి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండలంలోని ఇట్యాల శివారులో పేకాటస్థావరంపై శనివారం దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఏడుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి నుంచి రూ.35,320 నగదుతోపాటు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని దహెగాం పోలీసుస్టేషన్‌లో అప్పగించామన్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి జుగ్నాక్ వంశీయుల పెర్సపేన్ పూజలు


సమావేశమైన జుగ్నాక్ వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని పొల్లుగూడ గ్రామంలో ఈనెల 14 నుంచి పెర్సపేన్ పూజలు నిర్వహించనున్నట్లు జుగ్నాక్ వంశం కటోడ(పూజారి) జుగ్నాక్ మహాదు అన్నారు. గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశం పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. పూజల నిర్వహణ గురించి చర్చించారు. 15న పెర్సపేన్ పూజలు నిర్వహించి గ్రామం చుట్టూ ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. 16న కుల దేవతకు పుణ్యస్నానం ఆచరించడంతోపాటు అదేరోజు రాత్రి మహాపూజ ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశీయులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. జుగ్నాక్ వంశీయులు జుగ్నాక్ కాశీరాం, మానిక్‌రావ్, భారత్, జాలింరావ్, గ్రామపెద్దలు ఆత్రం శంకర్, భుజంగ్‌రావ్, కొరెంగా జుగాదిరావ్, మర్సుకోల నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యాబోధన తీరు గురించి పదో తరగతి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. రక్త నత అరికట్టేలా విటమిన్ ‘సీ’టాబ్లెట్లు ఇవ్వాలన్నారు. మొవా లడ్డూ, గుడ్లు, పాలు, రాగి మాల్టా అందించాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

గిరిజన పోషణ మిత్ర పథకం ప్రారంభం

ఉమ్మడి ఆదిలాబాద్ ఐటీడీఏ పరిధిలోని 60 ఆశ్రమ బాలికల పాఠశాలలు, వసతి గృహాల్లో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. పథకం అమలుకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. వారంలో రెండు సార్లు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు సందర్శించి నివేదికను పీవోకు అందిస్తారని పేర్కొన్నారు. విద్యార్థినులు రక్తహీనత బారినపడకుండా ఇప్పపువ్వు లడ్డూ, విటమిన్ ‘సీ’, ఐరన్ మాత్రలను ప్రతీవారం రెండు సార్లు అందిస్తారని తెలిపారు. ఐటీడీఏ ఉద్యాన నర్సరీల్లో పెంచిన కరివేపాకు, మునగ తదితర మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

‘గిరిజన పోషణమిత్ర’ పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని జామడ, నార్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో రికార్డులు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. మహువా లడ్డూతోపాటు విటమిన్ సి మాత్రలను వారంలో రెండుసార్లు విద్యార్థినులకు అందిస్తారన్నారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎంలు చౌహాన్ వందన, విట్టల్, వార్డెన్ వనిత పవర్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

9న జాబ్‌మేళా

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపా రు. హైదరాబాద్‌లోని గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీలో ఒక జూనియర్ కెమిస్ట్ పోస్టుకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. 2023-24లో ఇంటర్ ఎంపీసీ/బైపీసీ పూర్తయి, కెమిస్ట్రీ సబ్జెక్టుతో డిగ్రీ చదువుతున్న ఉమ్మడి జిల్లా విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఇందులో ఎంపికైనవారికి ఏడాదికి రూ.2.05 లక్షల జీతం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణలో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ 9885762227 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నీల్వాయిలో బర్డ్‌వాక్


బర్డ్‌వాక్ నిర్వహిస్తున్న అధికారులు

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం బర్డ్‌వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ ఎన్నో వైవిధ్యమైన పక్షి జాతులు ఉన్నట్లు రిసోర్స్‌పర్సన్ రాంజాన్ విరాని గుర్తించారు. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీల్వాయి ప్రాజెక్టు పరిసరాలు అరుదైన పక్షులకు నిలయమని నీల్వాయి, చెన్నూర్ అటవీ రేంజర్లు అప్పలకొండ, శివకుమార్ తెలిపారు. డీఆర్వోలు ప్రమోద్‌కుమార్, ఎఫ్‌ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి


మాట్లాడుతున్న లంకా రాఘవులు

ఎదులాపురం: వ్యవసాయ కూలీలకు కూలీబంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సుందరయ్య భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ కూలీలకు కూలీబంధు అమలు చేయాలని, గ్రామసభలో అర్హులైన కూలీలను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు ఈ ధర్నాలో అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు ఆశన్న, కిష్టన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.